# వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ఊపిరాడని ఢిల్లీ


**చలికాలం** వచ్చిందంటే చాలు ఢిల్లీ గజగజ వణుకుతుంది. గడ్డ కట్టించే చలి ఒక్కటే కాదు, ఊపిరాడనీయని కాలుష్యమూ అందుకు కారణం. ప్రస్తుత సీజన్‌లో ఢిల్లీ కాలుష్యం డబ్ల్యూహెచ్‌ఓ అనుమతించిన స్థాయి కంటే 100 రెట్లు అధికంగా ఉన్నట్టు వచ్చిన వార్తలు ఆం దోళన కలిగిస్తున్నాయి. పంజాబ్, హర్యానా రైతులు పంటలు వేసేందుకు ముందు పొలాల్లోని గడ్డీగాదాన్ని తగులబెట్టడం వల్ల ఏర్పడే పొగ గాలిలో కలిసి ఢిల్లీ దిశగా వస్తుంది. ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల ఆ పొగమంచుతో కలగలిసిన కాలుష్యం చిక్కబడి దేశ రాజధాని నగరాన్ని కమ్మేస్తుంది. ఇది ఏటా జరిగే తంతు అయినప్పటికీ ఈ సారి తీవ్రత అధికంగా ఉన్నట్టు తెలుస్తున్నది. దీని ఫలితంగా జనజీవనం అతలాకుతలమవుతున్నది. ఏటా మాదిరిగానే ఢిల్లీ ప్రభుత్వం అత్యవసర చర్యలు ప్రారంభించింది. బడులకు సెలవిచ్చారు. ఢిల్లీ సర్కారు మరోసారి సరి-బేసి వాహన విధానం అమల్లోకి తెచ్చింది. సామాన్య ప్రజలు ఊపిరాడక ఇబ్బందులు పడుతుంటే, ఉబ్బసం తదితర వ్యాధులతో బాధపడేవారు తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇది ఏటా ఎదురయ్యే సమస్యే అయినప్పటికీ ఇటు ఢిల్లీ గానీ, అటు కేంద్ర సర్కారు గానీ పటిష్ఠమైన చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కాలుష్యం నియంత్రణకు చేపట్టిన పకడ్బందీ చర్యలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇందులో హరితహారం తలమానికంగా నిలుస్తున్నది. దీని ఫలితంగా అటవీ విస్తీర్ణం 7.7 శాతం పెరిగినట్టు అటవీ సర్వే విభాగం ధ్రువీకరించింది. పల్లె ప్రకృతి వనాలు దీనికి సైదోడుగా నిలుస్తున్నాయి. వాయు కాలుష్యానికి ప్రధానంగా కారణమయ్యే వరి కొయ్యలను కాల్చొద్దని ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తున్నది. ప్రగతిశీల విద్యుత్తు వాహనాల విధానంతో కాలుష్య రహిత ప్రయాణాన్నీ ప్రోత్సహిస్తున్నది. రాజధాని హైదరాబాద్ నగరంలో బ్యాటరీ బస్సులను క్రమంగా పెంచుకుంటూ వస్తున్నది. దూర ప్రాంత సర్వీసులకూ వీటిని ప్రవేశపెడుతున్నారు. వీటన్నింటి ఫలితంగా కాలుష్యం చాలావరకు అదుపులోకి వస్తున్నది.

కాలుష్యం ఆరోగ్య సమస్య మాత్రమే కాకుండా ఆర్థికరంగంపై కూడా ప్రభావం చూపుతుందనేది తెలిసిందే. జీడీపీ వృద్ధి, ఉత్పాదకత, తలసరి ఆదాయాలు గణనీయంగా తగ్గడానికి కాలుష్యమే కారణమని ఇటీవల జరిగిన అధ్యయనాలు తెలుపుతున్నాయి. వైద్యరంగంపై ప్రభుత్వం చేసే వ్యయాలు మాత్రం ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతాయి. భారత్ వంటి వర్ధమాన దేశం మనసు పెట్టి ఆలోచించాల్సిన అంశం ఇది. చలికాలంలో ఢిల్లీ లాగే నైరుతి రుతుపవనాలు తిరుగుముఖం పట్టే సమయంలో ఆర్థిక రాజధాని ముంబై కూడా కాలుష్యం సమస్యను ఎదుర్కొంటుంది. కాలుష్య ప్రభావంతో 2030 నాటికి వార్షిక జీడీపీ నష్టం 4.5 శాతానికి చేరుకుంటుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల ఒక నివేదికలో హెచ్చరించింది. ప్రపంచంలోని 30 అత్యధిక కాలుష్యం ఉన్న నగరాల్లో 20కి పైగా భారత్‌లోనే ఉండటం గమనార్హం. ఈ పరిస్థితి విధానపరమైన స్పందన తక్షణావశ్యకతను తెలియజేస్తున్నది.

## ఈ పథకం ఎందుకో?

*ప్రపంచ ఆకలి సూచిలో 125 దేశాలకు గాను మన దేశం 111వ స్థానంలో నిలిచింది. కేంద్రప్రభుత్వం ఈ ర్యాంకింగ్‌లను తిరస్కరించింది. కానీ ఇప్పుడెమో పేదలెవరూ ఆకలితో నిద్రపోకూడదని పేర్కొంటూ ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకాన్ని మరో ఐదేండ్లు పొడిగిస్తున్నట్టు ప్రకటించారు. పదేండ్ల 'అచ్చేదిన్' తర్వాత కూడా ఇది అవసరమైందా?*



**- కపిల్ సిబల్,** రాజ్యసభ సభ్యుడు

# కాళేశ్వరంపై కల్ల మాటలు

**మేడిగడ్డ బరాజ్‌లోని 89 పియర్స్‌లో కేవలం 2 పియర్స్ కుంగిన సంగతి అందరికీ తెలిసిందే. భారీ నిర్మాణాల్లో ఇలాంటివి జరగడం అత్యంత సహజమని ప్రపంచ బ్యారేజీల, ఆనకట్టల, ఇతర కాంక్రీట్ నిర్మాణాల చరిత్ర చెప్తున్నది. ఇంత సహజమైన విషయాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయి. మరో మూడు వారాల్లో రాష్ట్ర శాసనసభకు పోలింగ్ జరుగబోతున్నందున కాళేశ్వరం ఘటనను ప్రధానాస్త్రంగా మలచాలనే నీచ రాజకీయానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దిగజారుతున్నాయి. కల్లోల జలాల్లో చేపలు పట్టాలనే దుర్మార్గులకు ఉద్యమ నేపథ్యం ఉండి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై విషాన్ని నింపుకొన్న మరికొందరు తోడవుతున్నారు.**



**వి.ప్రకాశ్**
90009 50400



కాళేశ్వరమనే 28 ప్యాకేజీలతో కూడిన ఒక మహా ప్రాజెక్టులోని వందలాది పియర్స్‌లో కేవలం రెండు పియర్స్ కొద్దిగా భూమి లోపలికి కుంగినందువల్ల మొత్తం కాళేశ్వరమే 'ఖతమైంద'ని విషప్రచారం చేస్తున్నారు. నీటి పారుదల అంశమే జటిలమైనది- అందులో భూ భౌతిక సంబంధ టెక్నికల్ అంశాలు మరింత సంక్లిష్టమైనవి. వీటిగురించి ఏ మాత్రం అవగాహన లేని వివిధ పార్టీల నేతలు, వారికి వంత పాడుతున్న కొందరు 'విద్యావంతులు', ఈ అంశాల పట్ల స్పష్టత లేని ఒక్కరిద్దరు రిటైర్డ్ ఇంజినీర్లు వాస్తవాలను అధ్యయనం చేయకుండా, తమ మిడిమిడి జ్ఞానంతో దురుద్దేశపూరితంగా కుట్రకు పాల్పడుతున్నారు. ఈ అంశాలపై ముఖ్యంగా కాళేశ్వరం భవిష్యత్తుపై ప్రజలకు విషయాలు తెలియాలి.

> **దేశంలోని నదులన్నింట్లో అత్యంత వేగంగా (ఫ్లాష్ ఫ్లడ్స్) ప్రవహించే నది గోదావరి. గోదావరి నదీజలాల్లో తెలంగాణ వినియోగించాల్సిన నీరు సుమారు 966 టీఎంసీలు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ వాటా జలాలను వినియోగించడానికి అవసరమైన ప్రాజెక్టుల, బ్యారేజీల నిర్మాణం జరగలేదు.**

'తెలంగాణ ఎగువన ఉన్నది, నీరు దిగువన ఉన్నది-మీకు నీరు రాద'ని ఆంధ్రా పాలకులు అప్పటి తెలంగాణ నాయకుల నోర్లు మూయించారు. నిజానికి గోదావరి నదిపై యాభై ఏడేండ్ల సమైక్య రాష్ట్రంలో ఒక్క బ్యారేజీని కూడా నిర్మించలేదు. దేవాదుల వద్ద నీటి లభ్యత కోసం తప్పనిసరిగా బ్యారేజీ నిర్మించాల్సి ఉన్నా ఉద్దేశపూర్వకంగానే ఎలాంటి బ్యారేజీ నిర్మించలేదు. దీనికి కారణాలు; రాజమండ్రి వద్ద గల ధవళేశ్వరం బ్యారేజీకి నీటిని నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడం, ఉభయ గోదావరి జిల్లాల్లో ఈ బ్యారేజీ కాల్వల ద్వారా సుమారు 10 లక్షల ఎకరాలకుపైగా ఆయకట్టుకు నీరు గోదావరి నిరంతర ప్రవాహం నుంచే అందుబాటులో ఉండటం. ఒకవేళ గోదావరిపై తెలంగాణ ప్రాంతంలో ఎక్కడ బ్యారేజీ (ఆనకట్ట) నిర్మించినా ఈ ప్రాంత వాగుల నుంచి నదిలోకి వచ్చే నీరు తిరిగి తెలంగాణ ప్రాంతంలోనే వినియోగిస్తారు తప్ప ధవళేశ్వరం దాకా పోదు. ధవళేశ్వరం వద్ద నీటికొరత ఏర్పడిన ప్రతీసారి శ్రీరాంసాగర్, కడెం, కిన్నెరసాని, తాలిపేరు వంటి తెలంగాణ ప్రాజెక్టుల గేట్లు తెరిచి నదిలోకి నీటిని మళ్లించిన ఉదాహరణలెన్నో. జూన్, జూలైలలో గోదావరిలో నీటి ప్రవాహం తక్కువగా ఉంటుంది. ఉభయ గోదావరి జిల్లాలోని లక్షలాది ఎకరాల ఆయకట్టులో మొదటిపంటకు సాగునీటి అవసరాల కోసం తెలంగాణలో తెగే చెరువుల నీరే దిక్కు. మన ప్రాంతంలోని చెరువులను నిర్లక్ష్యం చేయడం వల్ల ఒక్క భారీ వర్షానికే గొలుసులోని చెరువులన్నీ ధ్వంసమయ్యేవి. ఉద్దేశపూర్వకంగానే ఈ విధ్వంసం జరిగింది. ఒకవేళ, తెలంగాణలోని గోదావరిపై ఎక్కడ బ్యారేజీ నిర్మించినా డెల్టాలో నీటి సమస్య ఏర్పడుతుంది. అందుకే గోదావరిపై బ్యారేజీల నిర్మాణం సమైక్య రాష్ట్రంలో జరగలేదు.

'తలాపున పారుతుంది గోదారి- నీ చేను, నీ చెల్క ఎడారి' పాటలు తెలంగాణ ఉద్యమంలో విన్నాం. ఈ కుట్రల వల్లనే తెలంగాణలో చివరి రెండు దశాబ్దాల్లో సుమారు 35 వేల మంది రైతులు నీటి గోసతో ఆత్మహత్య చేసుకున్నారు. ఉపాధి లేక లక్షలాది మంది దూర ప్రాంతాలకు వలసపోయారు. వేలాది మంది నక్సలైట్ల ఉద్యమంలో చేరారు.

కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ముఖ్యమంత్రి కాగానే రైతుల సాగునీటి గోస తీర్చడానికి 'ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు'పై దృష్టిపెట్టారు. చేవెళ్ల దగ్గర కాల్వలు తవ్వినా ప్రాణహితపై బ్యారేజీ నిర్మాణానికి అప్పటిదాకా కనీస అనుమతులు కూడా తీసుకోలేదని, మహారాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర జల సంఘం అనుమతులు పొందే అవకాశం కూడా లేదని అర్థం చేసుకొని కేసీఆర్ ఈ ప్రాజెక్టు రీ-డిజైన్‌కు ప్రయత్నించారు. దీనిలోభాగమే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పంప్‌హౌజ్‌ల నిర్మాణం. ఆంధ్ర నేతల మాటల్లో చెప్పాలంటే 'దిగువన ఉన్న గోదావరి జలాలు ఎగువన ఉన్న తెలంగాణ'లో పారాలంటే ఎత్తిపోతలే దిక్కు. ఎప్పుడైతే ఈ బ్యారేజీల నిర్మాణానికి కేసీఆర్ ప్రయత్నాలు ప్రారంభించారో ఆరోజు నుంచే కాళేశ్వర ప్రాజెక్టుపై విషం చిమ్మడం మొదలుపెట్టారు ఆంధ్రా నేతలు. వీరితో గొంతు కలిపారు తెలంగాణలోని కేసీఆర్ వ్యతిరేకులు, ప్రతిపక్షాలు.

కాళేశ్వరం ప్రాజెక్టులోని అతిపెద్ద బ్యారేజీ మేడిగడ్డ వద్ద నిర్మించిన లక్ష్మీ బ్యారేజీ. ఈ బ్యారేజీ పొడవు సుమారు 1600 మీటర్లు. దీనిలో 8 బ్లాకులుండగా ఒక్కో బ్లాకులో సుమారు 10-12 పియర్స్, రేడియల్ గేట్ల (మొత్తం 86) నిర్మాణం జరిగింది. ఈ బ్యారేజీని నిర్మించింది ప్రపంచ ఖ్యాతిగాంచిన, దేశానికే గర్వకారణమైన ఎల్ అండ్ టీ సంస్థ.

> **మేడిగడ్డ బ్యారేజీతోపాటు 7 లింకులలో 28 ప్యాకేజీలు కాళేశ్వరం ప్రాజెక్టులో ఉన్నాయి. 203 కిలోమీటర్ల టన్నెల్స్ (సొరంగాలు), 1,531 కిలోమీటర్ల పొడవైన ప్రవాహ కాల్వలు, 22 లిఫ్టులు, 141 టీఎంసీ నీటిని నిల్వజేసే 17 రిజర్వాయర్లు, నీటిని ఎత్తిపోసే 91 పంపులు... ఇవన్నీ కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగం. ఇంత పెద్ద వ్యవస్థలోని రెండు మూడు పియర్స్ కుంగితే మొత్తం కాళేశ్వరమే 'ఖతమై'నట్టా? ప్రాజెక్టుపై చేసిన వ్యయం సుమారు లక్షా పది వేల కోట్లు మొత్తం వృథాయేనా? ఎంత ఎన్నికల సమయమైనా ఇంత దిగజారి నీచరాజకీయాలకు పాల్పడితే ప్రజలు వీరిని క్షమిస్తారా?**

మేడిగడ్డ లక్ష్మీబరాజ్ 7వ బ్లాకులోని 19, 20వ పియర్స్ కొద్దిగా కుంగడాన్ని అక్టోబర్ 21న ఇరిగేషన్ అధికారులు మొదటిసారి గమనించారు. మరునాడే కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర జలశక్తి శాఖ మంత్రికి ఈ అంశంపై లేఖరాస్తూ డ్యాం సేఫ్టీ అథారిటీ అధికారులతో విచారణ జరిపించాలనీ కోరారు. మరుసటి రోజే 23వ తేదీన డ్యాం సేఫ్టీ అధికారులు రంగంలోకి దిగి 24న మేడిగడ్డ బ్యారేజీ పైన రెండు గంటలు ఇంజినీర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకొని 25వ తేదీన జలసౌధన రాష్ట్ర ఇరిగేషన్ కార్యాలయంలో అధికారులతో చర్చించారు. 20 అంశాలపై ఎన్‌డీఎస్ఏ అధికారులు వివరాలు కోరగా అందుబాటులో ఉన్న డాక్యుమెంట్లు ఇచ్చి మిగిలినవాటికి సమయం కావాలని అడిగారు. వెంటనే వివరాలు ఇవ్వాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేశారు. నవంబర్ 1న రాష్ట్ర ప్రభుత్వం వివరాలు ఎన్‌డీఎస్ఏ అధికారులకు పంపించింది. ఈ వివరాలు వచ్చేదాకా ఓపిక పట్టకుండా, బ్యారేజీ వద్ద ఎలాంటి పరిశీలన జరపకుండా కిషన్‌రెడ్డి రాసిన లేఖలో ప్రస్తావించిన వాటినే పరిగణనలోకి తీసుకొని తమ నివేదికను ఎన్‌డీఎస్ఏ నేరుగా పత్రికలకు విడుదల చేసింది. దీనిపై రాష్ట్ర జల వనరుల కార్యదర్శి, స్పెషల్ సీఎస్ రజత్‌కుమార్ తీవ్రంగా ప్రతిస్పందించిన విషయం తెలిసిందే. బాధ్యత గల ప్రతిష్ఠాత్మక సంస్థ ఎన్‌డీఎస్ఏను కూడా బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐల వలె తమ జేబు సంస్థగా మార్చిందని వీరి నివేదికను చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది.

మేడిగడ్డ బ్యారేజీ పియర్స్ ఎందుకు కుంగినవో కారణాలు తెలుసుకోవాలంటే నదీగర్భంలోని నీటినంతా ఖాళీజేసి సుమారు 13 మీటర్ల లోతుకు వెళ్లి పియర్స్ కింది 4 మీటర్ల ఎత్తుగల రాఫ్ట్ అడుగు భాగాన్ని పరిశీలించాలి. అప్పటిదాకా వేచి చూడకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని తప్పుబట్టే లక్ష్యంతో హడావుడిగా ఎన్‌డీఎస్ఏ తమ నివేదికను రూపొందించి విడుదల చేసింది. ఈ నివేదికలో కిషన్‌రెడ్డి తన లేఖలో వెలిబుచ్చిన అనుమానాలనే ఎన్‌డీఎస్ఏ వ్యక్తం చేయడం ఆ సంస్థ బాధ్యతారాహిత్యమే. ఈ తప్పుల తడక నివేదికను అడ్డం పెట్టుకొని ప్రతిపక్షాలు, కరడుగట్టి న కేసీఆర్ వ్యతిరేకులు కొందరు ఈ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి రాకుండా నివారించాలనే దుష్టబుద్ధితో అసత్యాలను, అవాస్తవాలను అదే పనిగా ప్రచారం చేస్తున్నారు. ప్రజలు వీటిని ఏ మాత్రం నమ్మకూడదు.

> **మేడిగడ్డ వద్ద జరిగింది ప్రమాదమే తప్ప ఎలాంటి డిజైన్ లోపం లేదని ప్రాథమిక అంచనాకు నిపుణులు వచ్చారు. ప్రపంచంలో గానీ, మన దేశంలో గానీ నిర్మించిన వేలాది డ్యాంలు, బరాజ్‌లతో ప్రారంభంలో ఇలాంటి బాలారిష్టాలు సంభవించినట్టు చరిత్ర చెప్తున్నది.**

ఒక్క ఇరిగేషన్‌లోనే కాకుండా భవనాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ల నిర్మాణాల్లో కూడా తరచుగా ఇలాంటి ప్రమాదాలు ఎన్నో జరిగాయి. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డ తొలినాళ్లలోనే కాంగ్రెస్ పాలనలో కడెం డ్యాం వరదకు కొట్టుకుపోతే తిరిగి నిర్మించారు. 44 ఏండ్ల కింద గుజరాత్‌లో 'మచ్చు' డ్యాం తెగి 'ఊళ్లకు' ఊళ్లు కొట్టుకుపోయి సుమారు 25 వేల మంది మరణించారు. నాటినుంచి నేటివరకు వందలాది డ్యాంలు, బ్యారేజీలతో జరిగిన ప్రమాదాలను మనం చూశాం. నిన్న, మొన్న గుజరాత్‌లో కూలిన కేబుల్ బ్రిడ్జి, సిక్కింలో వరద ధాటికి కొట్టుకుపోయిన చుంగ్ తంగ్ డ్యాంలను మనమింకా మరిచిపోలేదు. ఈ డ్యాం ప్రమాదంలో 175 మంది మరణించినా ఇప్పటిదాకా నివేదిక ఇవ్వని ఎన్‌డీఎస్ఏ మేడిగడ్డ విషయంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం అందించిన వివరాలు పరిశీలించకుండానే, ప్రమాదం జరిగిన స్థలంలో ఎలాంటి శాస్త్రీయ పరిశోధన, విచారణ జరపకుండానే బీజేపీ నేతల పర్యవేక్షణలో ఢిల్లీలో కూర్చొని అసత్యాల నివేదికను రూపొందించింది. ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని ఇప్పటికే ప్రకటించింది. కాబట్టి ఎన్‌డీఎస్ఏ నివేదికకు ఏ విలువా లేదు. దీన్ని ప్రామాణికంగా తీసుకొని సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేయాలని ప్రయత్నిస్తున్నవారు ఎలాంటి వారైనా వారిని తెలంగాణ ద్రోహులుగానే ప్రజలు భావించాలి.

మేడిగడ్డలో కుంగిన పియర్స్‌ను తన డబ్బుతో ఎల్ అండ్ టీ సంస్థ జూన్‌లో పునర్నిర్మిస్తుంది. ప్రజలపై ఎలాంటి భారం పడదు. రైతాంగానికి ఎలాంటి భారం పడదు. రైతాంగానికి ఎలాంటి నష్టం ఉండబోదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు వచ్చిన ప్రమాదమేమీ లేదు. రాబోయే రోజుల్లో ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 40 లక్షల ఎకరాల్లో పంటలు పండుతాయి. ఓట్ల కోసం నీచ రాజకీయాలకు పాల్పడుతున్న పార్టీలను, వ్యక్తులను, సంస్థలను ప్రజలు తిరస్కరిస్తూ తమ నిరసన తెలుపాలి. వీరి కుట్రలను ఛేదించాలి.

> **మేడిగడ్డలో కుంగిన పియర్స్‌ను తన డబ్బుతో ఎల్ అండ్ టీ సంస్థ జూన్‌లో పునర్నిర్మిస్తుంది. ప్రజలపై ఎలాంటి భారం పడదు. రైతాంగానికి ఎలాంటి భారం పడదు. రైతాంగానికి ఎలాంటి నష్టం ఉండబోదు. కాళేశ్వరం ప్రాజెక్టుకు వచ్చిన ప్రమాదమేమీ లేదు. రాబోయే రోజుల్లో ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 40 లక్షల ఎకరాల్లో పంటలు పండుతాయి. ఓట్ల కోసం నీచ రాజకీయాలకు పాల్పడుతున్న పార్టీలను, వ్యక్తులను, సంస్థలను ప్రజలు తిరస్కరిస్తూ తమ నిరసన తెలుపాలి. వీరి కుట్రలను ఛేదించాలి.**

**(వ్యాసకర్త: తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్)**

# కుంపటి వేరైనా కుట్రలు ఆగలేదు

**తెలంగాణ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన శక్తులన్నీ ఇప్పుడు మరోసారి శాసనసభ ఎన్నికల ద్వారా తెలంగాణపై పెత్తనం చెలాయించడానికి మరోసారి తమ ప్రయత్నాలు సాగిస్తున్నాయి. 2018 ఎన్నికల్లో మహాకూటమి పేరుతో బహిరంగంగానే ప్రయత్నించగా, ఇప్పుడు మారువేషాల్లో ఆ ప్రయత్నాలు చేస్తున్నారు. మహా కూటమిలో కాంగ్రెస్ ప్రధాన పక్షం అయినప్పటికీ మహాకూటమి అనే పేరుతో సహ కూటమి ప్రచారంలో చంద్రబాబుదే పెద్దన్న పాత్ర.**

ఉద్యమకాలంలో తెలంగాణ ఏర్పాటును అడ్డుకోవడానికి మీడియా తీవ్రంగా కృషిచేసింది. అదే మీడియా 2018లో మహాకూటమిదే అధికారం అనే అభిప్రాయం కలిగించేవిధంగా ప్రచారం చేసింది. తెలంగాణ ప్రజలు ఉద్యమకాలం నాటి స్ఫూర్తి చూపడంతో మహాకూటమి ప్రయత్నాలు ఫలించలేదు.



**బుద్దా మురళి**



తెలంగాణ ఏర్పాటుకు సర్వశక్తులు ఒడ్డిన పక్షాలు తెలంగాణ ఏర్పాటు తర్వాత కూడా తమ ప్రయత్నాలను మానలేదు. ఈసారి బాబుతో పాటు షర్మిల, కర్ణాటక నుంచి డీకే శివకుమార్ తెలంగాణలో పెత్తనం కోసం తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నారు. తెలంగాణ, ఏపీ రెండు రాష్ట్రాలు ఏర్పడిన తర్వాత చంద్రబాబు పారిశ్రామికవేత్తలతో ఓ సమావేశం నిర్వహించి ఉమ్మడి ఏపీలో దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా గుడి వద్ద తీవ్రవాదుల పేలుళ్ల వీడియో చూపించి 'తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టవద్దు ఆంధ్రలో పెట్టండ'ని చెప్తూ హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీసే ప్రయత్నం చేశారు. 'ఆందోళనలు, ఉద్యమాలుండవు మా వద్ద పెట్టుబడులు పెట్టండ'ని బహిరంగంగా కోరారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టమని కోరడం తప్పు కాదు, అది ముఖ్యమంత్రి బాధ్యత. ఇందుకోసం ఇతర రాష్ట్రాలపై తప్పుడు ప్రచారం చేయడం సరైనది కాదు.

సాధారణ మెజారిటీతో తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నించారు. అప్పుడు టీడీపీలో ఉన్న ప్రస్తుత పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ద్వారా మండలి ఎన్నికల్లో ఎమ్మెల్సీ ఓటు కొనడానికి డబ్బుతో పంపితే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో తెలంగాణ ప్రభుత్వం బతికిపోయింది. బాబు ఓటుకు నోటు ప్రయత్నం విజయవంతమైతే ప్రభుత్వమే కూలిపోయేది. బాబు తాను తెలంగాణకు చేటు చేయాలనుకున్నా ఓటుకు నోటు కేసు వల్ల తెలంగాణకు మేలే జరిగింది. అప్పటివరకు హైదరాబాద్‌లోనే మకాం వేసి ఆంధ్రను పాలిస్తున్న బాబు ఆంధ్రకు వెళ్లక తప్పలేదు. తర్వాత ఉద్యోగులు తరలివెళ్లారు. ఓటు కొనేందుకు బాబు చేసిన టెలిఫోన్ సంభాషణ రికార్డ్ కావడంతో తెలంగాణకు, ఆంధ్రకు ఓ రకంగా మంచే జరిగింది. రాజధాని, ఉద్యోగులు, ముఖ్యమంత్రి ఆంధ్రకు తరలివెళ్లారు. ఆంధ్ర రాష్ట్ర పాలన ఆంధ్ర నుంచే మొదలుకావడానికి ఉపయోగపడింది. ఆ తర్వాత కూడా బాబుకు తెలంగాణపై పెత్తనం చేయాలనే ఆశ చావలేదు.

2018 ఎన్నికల్లో మహాకూటమి ఏర్పాటుచేసి టీడీపీ, కాంగ్రెస్ కలిసి పోటీచేశాయి. కాంగ్రెస్ వ్యతిరేకతే తెలుగుదేశం సిద్ధాంతం అని ఎన్టీఆర్ కాలం నుంచి ఆ పార్టీ వాళ్లు గర్వంగా చెప్పుకొనేవారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్టీఆర్ నివాసానికి లక్ష్మీపార్వతి కాంగ్రెస్ నేత టి.సుబ్బిరామిరెడ్డికి భోజనానికి పిలిచారని పవిత్ర టీడీపీని అపవిత్రం చేశారని బాబు వర్గం విమర్శలు చేసింది, భోజనానికి పిలిస్తేనే అపవిత్రం చేశారని విమర్శించిన వారు తెలంగాణలో పెత్తనం చేయడానికి కాంగ్రెస్‌తో కలిసి పోటీచేశారు. 2018 ఎన్నికల్లో మహాకూటమి గెలుపు ఖాయమని ఎవరికి వారు తామే ముఖ్యమంత్రి అన్నారు. మంత్రివర్గాలను ఏర్పాటుచేసుకున్నారు. తీరా ఫలితాలు వచ్చాక టీడీపీ, కాంగ్రెస్ రెండూ చతికిలపడ్డాయి. ఎన్టీఆర్ మనవరాలు సుహాసినిని కూకట్‌పల్లిలో నిలబెట్టి బాలి చేశారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బాబు, లోకేష్ విస్తృతంగా ప్రచారం చేసినా ఒకే ఒక వార్డుకు పరిమితమయ్యారు. తెలంగాణ ఎన్నికల్లో ప్రజలు తమను నమ్మరని అర్థమైన తర్వాత బాబు ఇప్పుడు బహువేషాల్లో తెలంగాణలో అధికారం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారు.

> **చంద్రబాబును స్కిల్ స్కామ్ కేసులో అరెస్టు చేసి రాజమండ్రి జైల్లో వేసిన తర్వాత ఆంధ్రలో కన్నా ఆ పార్టీ సానుభూతి పరులు, మద్దతుదారులు హైదరాబాద్‌లోనే ఎక్కువగా ఆందోళనలు చేశారు. అరెస్టుకు ముందు బాబు ఖమ్మంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈసారి తెలంగాణలో అధికారంలోకి వస్తామని ప్రకటించారు. అరెస్టు తర్వాత ఈ సారి తెలంగాణలో ఎగిరేది టీడీపీ జెండానే అని లోకేష్ ట్వీట్ చేశారు.**

బాబు అరెస్టును ఖండించలేదని ఈసారి కాంగ్రెస్‌ను అధికారంలోకి తెస్తామని టీడీపీ అభిమానులు, టీడీపీ తటస్థులు, కుల సంఘం ప్రకటించాయి. మా పార్టీని గెలిపించుకుంటామనడం మామూలే కానీ, వారికి ఓ పార్టీ ఉన్న తర్వాత మరో పార్టీని గెలిపిస్తామనడం విచిత్రం. వీరి ప్రకటనకు తగ్గట్టే తెలంగాణలో ఈసారి పోటీ చేయకూడదని టీడీపీ నిర్ణయాన్ని ప్రకటించింది. తెలంగాణలో పోటీకి దూరమన్నారు కానీ, తెలంగాణపై పెత్తనం చేయాలనే రాజకీయానికి దూరంగా లేరు. కాంగ్రెస్ ద్వారా తెలంగాణలో పెత్తనం చెలాయించడానికి బాబు ప్రయత్నిస్తున్నారు. పవన్‌కళ్యాణ్, చంద్రబాబు భేటీ అయిన కొద్దిసేపటికే జనసేన బీజేపీ మధ్య తెలంగాణలో పొత్తు ఖరారైంది.

బాబు అటు కాంగ్రెస్ కోసం, ఇటు బీజేపీ కోసం తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆంధ్రలో బీజేపీ పొత్తు కోసం బాబు ప్రయత్నిస్తున్నా బీజేపీ స్పందించడం లేదు. పవన్ ద్వారా బాబు ఆ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఖమ్మం జిల్లా టీడీపీ అధ్యక్షుని ఇంటికి కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు వెళ్లి మద్దతు కోరారు. కాంగ్రెస్, టీడీపీ నాయకుల స్నేహానికి ఖమ్మంలో తుమ్మల శ్రీకారం చుట్టారు. తెలంగాణలో రాజన్న రాజ్యం తీసుకువస్తానని షర్మిల పాదయాత్ర చేశారు. అలసట తప్ప తెలంగాణ ప్రజల నుంచి మద్దతు లభించలేదు. సొంత పార్టీ ద్వారా తెలంగాణపై పెత్తనానికి షర్మిల చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో కాంగ్రెస్ ద్వారా తెలంగాణలో పెత్తనానికి ఆమె ప్రయత్నిస్తున్నారు. ఒక్క సీటు కూడా లేకుండా ఆమె కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. తాను కూడా పోటీ చేయడం లేదని ప్రకటించారు. తాము పోటీ చేయకపోయినా కాంగ్రెస్ గెలిస్తే పెత్తనం చేయవచ్చనేది బాబు, షర్మిల బృందం ఆశ. వీరికి ఇంతకాలం అండగా నిలిచిన మీడియా సైతం వీరి దారిలోనే కాంగ్రెస్ ద్వారా తెలంగాణపై అధికారం చెలాయించాలనుకుంటున్నది.

ఆంధ్ర నాయకుల పెత్తనాన్ని చైతన్యవంతమైన తెలంగాణ అంగీకరించదు. ఆంధ్రాలోనే బాబుకు రాజకీయ భవిష్యత్తు కనిపించడం లేదు. ఇక తెలంగాణలో ఆదరణ ఉంటుందా? ఏ రూపంలో వచ్చినా గుర్తించేంత చైతన్యం తెలంగాణలో ఉన్నది. ప్రతి ఎన్నికల్లో అది నిరూపిస్తున్నారు. ఈ ఎన్నికల్లోనూ నిరూపిస్తారు.



## మేలెన్నిక

అమ్మ లాంటి నమ్మకం
నీ ముందు నడుస్తున్నది
నాయినసొంటి ధైర్యం
నీ వెన్నంటి వస్తున్నది

'గూట్లె దీపం
నోట్లె బుక్క'
ఎద్దెం మద్దెం గాని దినాలే
నీ పక్కల వున్నయి

నీ బురద కాళ్లను కడిగే గంగ
నీ నెత్తిమీదే వున్నది

ఎక్కేందుకు, ఎగబాకేందుకు,
ఎదిగేందుకు
కాళ్లకాడ
నిచ్చెన వేసే వున్నది

ఆరిపోని కొత్త బంగారి వెల్గుల
ఖాన్దాన్ ప్రతీకలు
నీ శ్వాసకు గర్వ పరిమళం
అందించేటట్టే వున్నయి

**మనసున్న వాడా!**

ప్రజాక్షేత్ర పాలకుడు
నీ కడపలో కాలు పెట్టిండు
పత్రమో, పుష్పమో సమర్పించి
అంతరంగపు ఆలింగనమియ్యి!

**- విశ్వావసు**